గోపి చేసిన గోల

[ఆదివారం ఉదయం 8 గంటల సమయం. గోపి, లక్ష్మి రీడింగు రూములో చదువుకొంటుంటారు. తల్లి వంట ఇంటిలో పని చూసుకొంటూ వుంటుంది.]

లక్ష్మి : [విసుగుతో పుస్తకము మూసి] అరే! గోపి, కేరమ్సు ఆడుదామ్రా!

గోపి : ఇప్పుడేగా నాన్నగారు బజారు వెళ్ళారు. మనం చదవటం లేదని, అమ్మ గనక నాన్నతో చెప్పిందీ అంటే, మన వళ్లు చితక పొడుస్తాడు నాన్న. తెలుసా?

లక్ష్మి : నీవెప్పుడూ ఇంతేరా! 'అన్నీ చదివేశాం. లెక్కల హోం వర్కు పూర్తిగా చేసేశాం. చదవాలసింది ఇంకేమి లేదు' అని చెప్పేదాంరా.

గోపి : నాన్నగారు బజారు వెళ్లింది ఇప్పుడేగా. ఎట్లా మరి?

లక్ష్మి : [క్షణం ఆలోచించి] అరే! కేరమ్సు వద్దులేరా. ఆడుతున్నప్పుడు చప్పుడు అవుతుంది. అది విని అమ్మ కోప్పడుతుంది. ఒక్క ఆదివారంకూడా ఈ చదువు పీడ లేకుండా హాయిగా వుండటానికి వీలులేదుగదా! స్కూలు వున్న రోజులలోనూ చదువే: శెలవల్లోనూ చదువే అయితే బుర్ర పాడైపోతుంది. మొన్న పేపరులో నాన్నగారు చదివి వినిపించారు – ఎవరికో పాపం, బి. ఏ. చదువుతూ వుండగా పిచ్చెక్కిందట! ఎక్కువగా చదివితే మనకూ తప్పదురా ఆ పరిస్థితి.

గోపి : ఏ పరిస్థితే అక్కా?

లక్ష్మి : అదేరా పిచ్చి! అందుకనే P. O. ఆడుదామా?

గోపి : చీట్లపేకా?

లక్ష్మి : అవును రా. చీట్లు అయితే చప్పుడు చేయకుండా, గుట్టు చప్పుడు కాకుండా ఆడుకోవచ్చు.

గోపి : సెట్లు ఆట ఆడుదామా?

లక్ష్మి : కాదు; పట్లు ఆట ఆడుదాం!

గోపి : సరేలే అక్కా. చదువుకొనే చాపమీద ఆడుదాం. నాన్నగారు వస్తే వెంటనే చదువుతున్నట్లు నటించవచ్చు.

లక్ష్మి : అట్లాగేలేరా, రా... వెళ్దాం.

గోపి : ఇంతకీ పేక ఎక్కడుందే?

లక్ష్మి : బీరువాలో ఉందో, మందుల అలమారాలో ఉందో! అమ్మనడిగి తాళాలు తెస్తాను. నువ్వు వెళ్ళి చదువుతున్నట్లు నటించు.

గోపి : మందుల అలమారాలో ఉందేమో చూస్తానే. అప్పుడప్పుడు నాన్న అక్కడ దాచి పెట్టుతుంటారు. [లక్ష్మి వంట గదిలోనికి వెళ్తుంది. గోపి మందుల అలమారాతీస్తాడు. దాన్నిండా హోమియోపతి మందు సీసాలుంటాయి. ఒకప్రక్క ఇంగ్లీషు మందు సీసా ఒకటి వుంటుంది.]

గోపి : అబ్బా! ఎంత తీయగా ఉంటాయి యీమాత్రలు! అబ్బా! అన్నీ పంచదారతో చేసిన మాత్రలు. అరే. ఇదేదో క్రొత్త

వల్లనూ వూహలచేత కూడా అర్థం చేసుకొని వ్రాయవచ్చును" అన్నాడు.

అప్పుడు సన్యాసి నవ్వుతూ "రాజా! అయితే తమరు యిప్పుడు వినికిడివలన, వూహలచేత బీదవారి స్థితి ఎట్లు వర్ణించారో, నిన్న మీ కుమార్తెకూడ అదే విధంగా వినికిడివల్ల, వూహచేత భార్యా భర్తల ప్రేమ కలాపమును గురించి వర్ణించింది. అది తెలుసుకోలేక, మమ్ములననుమానించారు. ఆమె తమరికే కాదు; నాకు కూడా బిడ్డతో సమానమే" అని చరచర వెళ్లిపోయాడు. రాయలు పశ్చాత్తాపంతో తన్ను క్షమింపమని బిడ్డను వేడటానికి అంతఃపురంలోనికి వెళ్లాడు.

★

★ గోపీ చేష్టలు ★

సీసాలాగా ఉందే!' ఇంత పెద్ద సీసాలో మందు మరీ తీయగా ఉంటుందేమో! రుచిచూసి అక్కతో చెప్తాను - క్రొత్త మందు సంగతి

[సీసాలోనుంచి చిటికెడు మందు తీసి నోట్లో వేసుకొంటాడు ఈలోగా లక్ష్మి వస్తూంది]

లక్ష్మి ఏమిట్రా మందు వేసుకొంటున్నావ్? ,

గోపి ఈమందు తియ్యగా లేదే అక్కా! అన్ని మందులూ పంచదారలాగా తీయగా ఉంటాయ్ మరి ఇది చప్పగా ఉందే [ఆముదము తాగినవాడిలా మొఖము పెట్టేశాడు]

లక్ష్మి • [మందు లేబిల్ చూస్తుంది "పాయిజన్" అన్న ఇంగ్లీషు అక్షరాలు బిగ్గరగాచదివి] ఏరా, ఈ మందేనా తింటున్నావ్‌? చెప్పవేరా? అలా వెర్రి మొఖము పెడతావేరా?

గోపి [తెల్లబోయి చూస్తూ] అవును

లక్ష్మి అమ్మోయ్ వీడు విషం తిన్నాడేవ్ అయ్యో ఎట్లాగురా? అమ్మా! అమ్మా! గోపిగాడు విషం తిన్నాడే! చచ్చేనరావే! అయ్యో!

గోపి [భయపడి] అక్కా ఏమిటో కడుపులో తిప్పుతోందే! తలకూడా తిరుగుతోందే దాహము వేస్తోందే మంచినీళ్లు .

లక్ష్మి తెస్తానుండురా! అమ్మా! అబ్బబ్బ! నిన్నే! మన గోపిగాడు విషం తిన్నాడే [ఏడుస్తూ చిందులు తొక్కుతూ వంటగదిలోకి పరుగెత్తుతుంది అరనిమిషం గడిచేలోగా లక్ష్మి, లక్ష్మితల్లి శారదా వస్తారు]

శారదా . అయ్యో! నాయనా! ఎందు కెళ్లావురా బీరువా దగ్గఱకు? చదువుకొంటున్న వాడివి అక్కడి కెందుకు వెళ్లాల్సి వచ్చిందిరా నాయనా! [తల బాదుకొంటుంది]

గోపి : అమ్మా-దా. హం వేస్తుందే [శారద వొళ్ళోకి తీసుకొంటుంది లక్ష్మి నీళ్లు తెచ్చి యిస్తుంది ఈలోగా తండ్రి రామారావుగారు గదిలోకి ప్రవేశించి-]

రామా ఏమిటే ఈహంగామా అంతాను?

శారద ఇంకా హంగామా అంటున్నారా - కొంప మునిగిపోతేను? మన గోపి విషం త్రాగి స్పృహతప్పిపడిపోయాడు చూడండి ముందు మీరు వెళ్ళి వైద్యుణ్ణి పిలుచుకురండి అలా చూస్తారేం? వెళ్ళండి!!

రామా • విషయ మేమిటే? ఎక్కడిదీ విషం?

శార ఎక్కడి దేమిటండీ! మందుల బీరువాలో తగలడిందట మన లక్ష్మి చదివి, అది విషమేనని

(5-వ పేజీ చూడండి)

నేనీఊరు చదువుకు రావడానికి కారణమేమిటో తెలుసా? మా ఊరు పట్టి పల్లెటూరు. అక్కడో వీధిబడి తప్ప చదువుకు వేరే స్కూలు ఏదీ లేదు. ఆ వీధిబడిలో అయినా పిల్లలకి చదువుకంటె అల్లరే ఎక్కువ వస్తుంది. అందుకని మానాన్న నన్ను ఆబడికి పంపించ లేదు. తనకు పొలంలో పని లేనప్పుడు మానాన్న నన్ను తన దగ్గరే కూర్చో పెట్టుకుని చదువు చెప్పేవాడు.

ఎక్కాలు, పద్యాలు వప్ప చెప్పడమంటే నాకు వళ్లు మండి పోయేది. అదేం కర్మమో - ఎన్ని మార్లు చదివినా వచ్చేవి కావు!

ఒకనాడేం జరిగిందంటే మా నాన్న పన్నెండో ఎక్కం సాయంత్రంలోగా వప్పచెప్పక పోతే వళ్లు చీరేస్తానని చెప్పి, పొలం వెళ్లి పోయాడు. నాన్నచేత చివాట్లు దెబ్బలు లేకుండా చదువు కుందామని ఎంతో బుద్ధిగా పుస్తకం తెరిచాను. ఇలా రెండుమాట్లు చదివేనో లేదో; మా జతగాళ్లంతా వచ్చి పడ్డారు. (మానాన్న ఎప్పుడు పొలం వెడతాడా అని పొంచి చూడ్డమే వాళ్లపని.) అంతే-సోము నాచేతిలో పుస్తకాలు లాగి అవతల పెట్టి మొదలెట్టాడు.

"ఒరే రామనాథాయ్! మరేం-మాంఛి ఆటరా! బలే బాగుంటుంది లేరా!"

"ఫోండి నే ఆడను. ఎక్కం రాకపోతే మానాన్న చంపేస్తాడు." అన్నాను చిరాకుగా.

"పోస్లే ఇంట్లో కూర్చుని అలాగే ఏడు! ఆనక మళ్లీ మాతో మాట్లాడావంటే చూస్కో, ఏం చేస్తానో - ఇప్పుడే చెప్తున్నా" అంటూ నన్ను బెదిరిస్తో వెళ్లి పోతూడు సోము.

వాడు మా పిల్లల మురాకి నాయకుడు. ఆరోజు వాళ్లంతా కొత్త రకం ఆట ఆడుకోడానికి ప్లాను వేసుకున్నారు. దాంట్లో నేనుంటే కాని వీల్లేని పరిస్థితి వాళ్లకు వచ్చి పడింది. వాడికోక్షం వచ్చేటప్పటికి అక్కడవున్న పిల్లలందరికీ ఉత్సాహం చచ్చి పోయింది. రాముడు నాదగ్గరకు వచ్చి "రారా; ఆట అయింతర్వాత సాయంత్రం దాకా చదువుకుందూ గాని! చాలా బాగుంటుందిరా" అని బ్రతిమాలాడు. నేనుకూడా వాళ్లు నాజట్టెక్కడ మానేస్తారో అని భయపడుతూనే ఉన్నానేమో, పుస్తకాలు మూలను పెట్టి వాళ్ల వెంట పడ్డాను.

"ఒరే సోమూ ఏం ఆటరా చెప్పవ్?" అని అడిగాను. సోము గాడికి కోపం అంతా పోయింది. ఎవడికోసం పోదూ?- వాళ్లాడే ఆట, నే లేకపోతే జరగనే జరగదు. ఎంచేతంటే - ఆడపిల్లల కున్నట్టు పొడుగాటి జుట్టు నాకే ఉన్నది-మామురా అందర్లోకి!

ఆమధ్య కరణంగారింట్లో పెళ్లయింది. ఆపెళ్లికి భోగం మేళం వచ్చింది. ఆమూడు రోజులూ మా పిల్లమూకంతా వాళ్లవెంటే తిరిగాం. వాళ్లు సభలో అభినయం చేసినప్పుడూ, ఊళ్లో ఊరేగినప్పుడూ, వాళ్లముందు ప్రేక్షకులం మేమే. అంచేత వాళ్లు పాడే పాటలు, చేసే అభినయమూ మాకు క్షుణ్ణంగా వచ్చేశాయి. (నాకు అదేం ఖర్మమో - ఎక్కాలు తప్ప అన్నీ ఇట్టే వచ్చేస్తాయి సుమండీ!) ఆరోజు ఆభోగంపాట ఆడాలని మా సోము నిర్ణయిం చేశాడు.

"ఒరే అడ్డానికీ, చేతులు తిప్పకోడానికీ నివ్వే పనికొస్తావురా! నీకు జడకూడా ఉంది!" అన్నాడు. ముఖ్య పాత్ర నాకిచ్చి నందుకు నాకెంతో గర్వంగా ఉన్నది.

"ఓ, తప్పకుండా, నేనే ఆవేషం వేస్తాను! నాకు పాటలు కూడా వచ్చేశాయి. సరే కాని...మరి... కాళ్లకి గజ్జెలెలారా?"

పెద్ద సమస్యే! అందరూ ఆలో

★ రామనాథాయ్ ★

పల్లో పెట్టారు. అంతలో వెంకి గాడికో ఆలోచన తట్టింది-ఎండు జువ్వకాయలు తెచ్చి దారానికి గుచ్చి కాళ్లకు కట్టుకుంటే 'గల్' 'గల్' మంటాయని. ఇన్ని జువ్వ కాయలు తెచ్చి గుచ్చి కాళ్లకు కట్టాడు. చికిలింత వెన్నెలతో చెవులకి, చేతులకి నగలు పెట్టకోవచ్చు- మా చెల్లెలు రవిణి పరికిణీ, జాకెట్టు చాటుగా పట్టుకొచ్చా.

ఇక నేం - మా తుతా అంతా మాదొడ్లో పశువుల పావిట్లోకి చేరాం. సరిగ్గా నేను వేషం వేసుకునే టప్పటికి ఎక్కణ్ణించి ఊడిపడిందో మా రవిణి-"ఒరే; నా పరికిణీ కట్టుకున్నావేంరా?" అని కేకేసింది.

"మేమాడు కుంటున్నామే"

"ఏం వాటరా అన్నయ్యా?"

"అప్పుడు... పెళ్లిలో భోగం వాళ్లాడేరే, ఆ ఆట."

"ఒరే, నేనూ ఆడొద్దురా?"

"ఛా ఛా! తప్పు! నువ్వింటోకి పో."

"ఆఁ ఆఁ నేను పోనూ, ఊఁ ఊఁ, నేనూ ఆడతా,"

మా సోమిగాడికి వళ్లు మండింది- "ఏయ్ పోతావా? రెండిచ్చుకోమన్నావా?" అని రయ్ మన్నాడు.

రవిణి ఏడుస్తూ ఇంట్లోకి పోయింది. అది యింట్లోకిపోయి ఏం బెడద తెచ్చిపెడుతుందో అని నాకు లోపల దిగులుగానే ఉన్నది, చెప్పొద్దూ! అయినా అప్పటికప్పుడే ఆటకి సరంజాం అంతా పూర్తయింది. నా వెనక నలుగురు కుఱ్ఱాళ్లు చిల్ల పెంకుల తాళాల్లా వాయించడానికి ఏర్పాటయింది. ఒకడు వెదురుబద్ద ఒకటి ఫిడేల్లా పట్టుకుని, ఇంకో వెదురుపుల్ల కమానుతో ఓ పక్కగా నిలబడ్డాడు. మా సోములు పాతడబ్బా ఒకటి మద్దెలకి సిద్ధం చేసుకున్నాడు. నేను ఆడే స్థలానికి ముందరగావచ్చి వంగి జువ్వకాయ గజ్జలు సరిచేసుకుని సభకి నమస్కారం చేసేను. సభంటే మనుష్యు లెవరున్నారు? ఆ పాక గుంజలూ, తట్టలు, బుట్టలు, పొలానికి వెళ్లని ఆవు దూడలూ, గేదె దూడలూ! ఇవే మా సభికులు. మా సోమిగాడు పాట అందించాడు.

"ఈ ..రా.. జా...సా...భలో"

మొదటి కాలంలో పాట

మొదలయింది. వెనక కుఱ్ఱాళ్లు పాటకి సరిగా 'టిక్కు' 'టిక్కు' తాళాలు వేస్తున్నారు. సోమిగాడు పాతడబ్బా 'ధన్' 'ధన్' మని పిస్తున్నాడు. నేను కుడికాలు ముందుకీ వెనక్కాలు వెనక్కీ పెట్టి, ఎడమచెయ్యి నడ్డిని పెట్టి, కుడి చెయ్యి చాపి ఎడమనుంచి కుడికి లాగుతూ సభవారి నుద్దేశించి పాడుతూ చక్కగా ఆడేను మా సోమిగాడు మద్దెల కొడుతూ తల తిప్పుతూ 'బలే! బలే' అని "ఈ... మా.. ళీ...కా.. ట్రైదన్"' అందించాడు.

అందరూ కలిసి 'ఈ...మా... ళీ...కా...ట్రైదన్!' అన్నారు.

సోములు రెండో కాలంలో పాట అందుకున్నాడు.

"ఈ... రా... జా ... సా... భలో — ఈ...మా...ళీ...కా... ట్రైదన్ ..."

ఇలా రెండుమూడు మార్లయిన తరువాత సభకి నమస్కారం చేస్తూ గమ్మున కూర్చోవాలి (శాస్త్రం ప్రకారం!) నేనామాట మర్చిపోయి ఇంకా జడ ఆడించుకుంటూ ఎగురుతూనే ఉన్నాను ఇంతలో మా సోమిగాడు "ఓరి చవట వెధవా! ఇంకకూర్చొని ఆడరా, యీపాటికి" అని వీపుమీదో గుద్దు గుద్దాడు. నాకు వళ్లు మండింది.

"ప్, వెధవ గొప్ప: నే ఆడనే ఆడను" కాళ్లకు కట్టిన గజ్జలు విప్పేయ బోయాను.

"ఒరే! ఒరే! మానేయకురా. ఆట పూర్తి కానీరా" రాముడు, వెంకిగాడు బతిమాలారు.

"ఇంకేమీ అనన్రా! ఆటలో అరిటిపండు. మర్చిపోయి కొట్టాను" సోములు క్షమార్పణ చెప్పుకున్నాడు. తిరిగి ఎక్కడి వాళ్లం అక్కడ సద్దుకున్నాము. ఈమాటు సోమిగాడి కంటె నేనే ముందుపాట అందుకున్నాను-ఆడేది నే నయితే వాడి పెత్తన మేమిటి-బోడి పెత్తనం!

"దో...న...కా...రిమా...ట. లా...డి. మో...న...పు...చ్చుట, న్యా...య. మా..." పాట సాగదీస్తూ పాడేను. దీర్ఘం ఉన్నమాట దగ్గిరల్లా చిల్ల పెంకులు మోగుతున్నాయి. వెధవ సోమిగాడు చచ్చినట్టు డబ్బా వాయిస్తున్నాడు! తానేమో పొడుచుకొచ్చి నట్లు అందరిమీదా అధికారం చలాయించటానికి వాడికేమన్నా జడ ఉందా? తిరుపతి మొక్కుందా? ఏడుకొండల వాడి ధర్మమా అని ఆవేళ నేనే మామురాకి నాయకుణ్ణయాను.

."దో న కా ...రి మా.. ట. లా డి మో న పు చ్చు ట. న్యాయమా, బాసచేసి దాటకురా గా సి చెం ది నా నునానుర, నే గాసిచెందినానురా"

పాట తారస్థాయిని మూడో కాలంలో పాడేస్తున్నాము. నేను శివమెత్తినట్టు అన్ని దిక్కులకు తిరిగి ఆడేస్తున్నాను.

ఉన్నట్టుండి సోమిగాడు డబ్బా వదిలి పరుగు లంకించుకున్నాడు. ఇదేమా అని చూద్దునుగదా! మిగతా పిల్లలందరూ తలోదారిని పరుగెత్తుతున్నారు. మానాన్న ప్రళయ రుద్రుడిలా ఓ చేత్తో నాజడలంకించుకుని, రెండోచేత్తో నా చెంప ఛెళ్లు మనిపించాడు నా తల తిరిగి పోయింది. కళ్లు చీకట్లు కమ్మాయి.

వళ్లు తెలిసి చూసేప్పటికి మా అమ్మ నన్ను పట్టుకుని సవిరిస్తూ నావేషం వూడ తీసేస్తోంది. మా నాన్న రొప్పుతూ బల్లమీద కూర్చున్నాడు. ఇంట్లో కెలా వచ్చానో నాకే తెలియదు!

"ఇంట్లో కూర్చున్నవాణ్ణి వుండ నివ్వరుగదా! దిక్కుమాలిన వాళ్లు. యమలాళ్లలా వచ్చి పడతారు వెధవసంతు" - మా అమ్మ ఊళ్లో పిల్లల్ని ఆడి పోసుకొంటోంది.

"మన వెధవకి బుద్ధిలేకపోగా వాళ్ల నెందుకు అనడం? చదువుకోరా వెధవా, అంటే తెయితక్క లాడతాడా? ఏడిరోగం ఇలా కాదు. ఒరే! నువ్వు పన్నెండో ఎక్కం, పద్యం, ఆరెండో ఇంగ్లీషు పాఠం వప్పచెప్తేనే ఇవాళ ఇంట్లో అన్నం పెట్టడం. తెలిసిందా? ఊ! జాగ్రత్త!" మానాన్న శిక్ష విధించి మళ్లీ పొలం వెళ్లిపోయాడు. ఇదంతా మా చుప్పనాతి రవణిపనే అయుంటుంది. లేకపోతే దొడ్లో ఎక్కడో వున్న మాసంగతి నాన్నకెలా తెలుస్తుంది?

మానాన్న బాగా చీకటిపడ్డ తరవాత ఇంటికి వచ్చాడు వస్తూనే భోజనంచేసి, నన్ను పిలిచాడు. ఎక్కాల పుస్తకం తీసుకుని బిక్కు, బిక్కు మంటూ ఆయన దగ్గిరకు పోయాను. ఆయనకు మధ్యాహ్నం వచ్చిన కోపం కొంచెం తగ్గింది కాబోలు-యిప్పటికి కొంచెం ప్రసన్నంగాఉన్నాడు. నేను పన్నెండో ఎక్కం తడుముకుంటూ మొదలు పెట్టాను.

★ రామనాథాయ్ ★

"ఒహో పన్నెండు పన్నెండూ. రెండు పన్నెండ్లిరవై నాలుగూ. మూడుపన్నెండ్లు! మూడుపన్నెండ్లు ముప్ఫైయ్యారూ. నాలుగు పన్నెండ్లు నలభైయెనిమిదీ ఐదు పన్నెండ్లరవై" ఇంతవరకూ బాగానే వచ్చింది. ఇక ఆతరువాతనే వున్నది గండం అంతాను.

"ఊఁ తరవాత?" గుడ్లెఱ్ఱచేస్తూ అన్నాడు నాన్న.

"ఐదు పన్నెండ్లరవై ఆరు పన్నెండ్లు! ఆరుపన్నెండ్లు! ఆరు—ఆరు పన్నెండ్లిరవైమూడు—"

అంతే - మా నాన్న ఉగ్రుడై పోయాడు. "ఓరి వెధవా! తప్పు చెప్పటానిక్కూడా అంత ఆలస్యమెందుకురా? ఆరుపన్నెండ్లిరవై మూడనడానికి అంత సేపాలోచించి ఏడవాలా?" అని ఓ మొట్టికాయ ఇచ్చుకున్నాడు. తప్పు చదవటానికి ఆలస్యమూ, ఆలోచనా అవసరం లేదనే సంగతి నాకు ఆ మొట్టికాయతో పాటు అప్పుడే బుఱ్ఱకెక్కింది.

"సరే. పద్యమేనా వచ్చిందా?" అని అడిగాడు నేను సమాధానం చెప్పకుండా తెలుగు పుస్తకం చేతికిచ్చాను.

"ఊఁ!—కానీ" అన్నాడు మా నాన్న.

నేను భయపడుతూ, ఏడుకొండల వెంకటరమణ మూర్తికి మనస్సులో దణ్ణంపెట్టి, పద్యం మొదలుపెట్టాను.

"ఎలుకతోలు తెచ్చి ఎన్నాళ్లు—కాదు ఎలుక, అహా కాదు, కాదు, 'తోలు ఎలుక తెచ్చి ఎన్నాళ్లుతోమినా!' అరె! మర్చిపోయాను ఇందాక వచ్చినట్టేవుంది! ఛీ, వెధవది—ఆఁ అమ్మయ్య-ఎలుకతోలు తెచ్చి ఎందాక ఉతికినా, తెలుపు తెలుపే కాని నలుపుకాదు; పురుషులందు పుణ్యపురుషులు వేరయా విశ్వదాభిరామ వినురవేమా"-చివర కాస్త రాగం కూడ తీసేను - ఎందుకైనా మంచిదని.

మానాన్న ముఖంలో అనేక రంగులు ఫిరాయించాయి - ఆయన నవ్వే ఆపుకున్నాడో, కోపమే ఆపుకున్నాడో నాకిప్పటికీ తెలియదు.

"ఇదేవిటిరా? గాడిదా! ఒక పద్యంలో పాదం పట్టకొచ్చి యింకో పద్యంలో తగిలించావు?" అన్నాడు. నేను జంకుతూ "నాన్నా మరీ, నువ్వేకాదు - ఎల్లాగా రాని దానికి ఆలస్యం కూడా ఎందుకన్నావు? అందుకని నాకు వచ్చిందేదో గబగబా చదివేశాను—" అన్నాను నా సమాధానం విని మానాన్న మండిపడి పోయాడు. "ఓరి దౌర్భాగ్యుడా!" అని మీదకు వచ్చేసరికి మాఅమ్మ అడ్డు పడింది.

"అలా హిరణ్యకశిపుడై పోతే పిల్లాడు బతకాలా అక్కర్లేదా? చాల్లెండి, మీప్రజ్ఞ! చెప్పేరు సతుకు!! దా బాబూ దా! అన్నం పెడతాను"

మాఅమ్మ నన్ను పెరట్లోకి తీసుకెళ్లి ముఖం కడిగి, మంచి గడ్డ పెరుగుపోసి అన్నం పెట్టింది.

"శ్రద్ధగా చదివితే పారం వచ్చేస్తుందికదరా! నాన్నగారిచేత దెబ్బలెందుకు తింటావు చెప్పు?" అంటూ ఎంతో ప్రేమగా నావీపు తడుముతో అడిగింది.

"అది కాదే అమ్మా! నాకు ఇంగ్లీషు పారం కంఠతా వచ్చిందే. ఎక్కం, పద్యం, బాగా రాలేదు కాని-కావలిస్తే ఇంగ్లీషు పాఠం ఇప్పుడు గడ, గడా వప్పచెప్పేస్తాను." అన్నాను నాభోజన మయింది. మాఅమ్మ నన్నుకూడా తీసుకుని మానాన్న వద్దకు వచ్చి "చూడండి; పిల్లాడిని కాస్త బుజ్జగించి చెప్పాలి కానీ, బెదర కొట్టేస్తే వచ్చింది కూడా మర్చిపోతాడు కుర్ర కుంక. వీడికి ఇంగ్లీషు పారం అంతా వచ్చిందిట. వప్పచెప్పుకుని కొత్తది చెప్పండి" అన్నది.

"ఏరా, వచ్చిందా" మానాన్న అడిగాడు. నేను తల తిప్పాను.

"ఐతే చదువు."

"దీజ్ ఆర్ పెన్సిల్స్, దీజ్ ఆర్ త్రీపెన్సిల్స = ఇవిమూడు పెన్సళ్లూ. దోజ్ ఆర్ బుక్స్, దోజ్ ఆర్ ఫోర్ బుక్స = అవి నాలుగుపుస్తకములూ" తడుముకోకుండ చదివాను. మానాన్న ముఖం వికసించింది. నాకెంతో గర్వంగా ఉంది. నాకెదురుగా ముందర దొడ్లో, కొబ్బరి చెట్లకింద నెమరు వేస్తున్న మాఆవులు కనిపించాయి, నా పాండిత్యం మా నాన్నకి చూపించాలని పుస్తకంలో లేని వాక్యాలు కూడా చదివాను.

"దోజ్ ఆర్ కౌస్ = అవి ఆవులూ దీజ్ ఆర్ చెట్స్. అవి—

"చెట్స్ ఏమిటిరోయ్?!"

"అవి చెట్లూ."

"చాలా బాగుంది! సరేకాని, దీజార్ చెట్సని అవి చెట్లంటా వేమిట్రా? చెవల వెధవా!"

“పుస్తకంలో అలాగే ఉంది నాన్నా!”

“ఎలా ఉంది?”

“ఓమాటు‘దోజారంటె’ ఇంకో మాటు ‘దీజార’నాలి. ఇంకా కావలిస్తే చూడు?

“నీ మొహం, నీ బొందాను! పోయిపడుకో ఈ పాటికి” మా నాన్నకు వళ్లుమండి పుస్తకం విసిరేశాడు. నాకు అంతకంటే వళ్లు మండింది. ఇంత చక్కగా చదివినా కూడా ఇంకా ఎందుకో ఆకోపం? మాట్లాడకుండ పోయి పడుకున్నాను.

మానాన్న మా అమ్మతో అంటున్న మాటలు ముసుగులోంచి వింటున్నాను. “ఇదిగో వీడిని గుమ్మందాటి వీధిలోకి వెళ్లనిచ్చినా, వీథిలో కుఱ్ఱాళ్లని ఇంట్లోకి రానిచ్చినా, వాడికి కాదు శిక్ష; నీకే తెలిసిందా?”

అమర్నాడు నాకు గట్టికట్టుబాటు చేసింది మాఅమ్మ నేను మాఇంట్లోంచి కదలటానికి వీల్లేదు, మధ్యాహ్నం దాకా పాఠాలు చదివాను. ఏమీ తోచదు. ఎంతసేపని మారవిణితో ఆడుకోడం? మధ్యాహ్నం అందరూ పడకలు వేశారు. నేను మా అమ్మని బతిమాలేను

“అమ్మా! వీధిలోకి ఎక్కడికీ వెళ్ల నే,దొడ్లో ఆడుకుంటానే ఏమే వెళ్లొద్దా?

“వద్దు. ఎండ మండిపోతోంది” మాఅమ్మ కళ్లు తెరవకుండానే జవాబు చెప్పింది.

“అమ్మా, చెట్లకింద నీడలో ఆడుకుంటూనే. ఎండిలోకి వెళ్లనే. ఏమే, అమ్మా! వెళ్లొద్దా?”

“ఆ. వెడితే వెళ్లరా గోల”మా అమ్మ నిద్దర మత్తులో నన్ను విదిలించి పారేసింది. అంతే-నేనొక్క పరుగుతీశాను దొడ్లోకి. మాదొడ్లో పెద్ద రేగి చెట్టొకటుంది. దానిమీద కాకులు గూడుకట్టి గుడ్లుపెట్టాయి.

★ రామనాథాయ్ ★

నాకా గుడ్లని చూడాలని ఎన్నాళ్ల నుంచో వున్నది. ఎప్పుడు చూద్దామన్నా, ఓకాకి అక్కడ కాపలా వుండేది. చెట్టుకింది కెవరయినా వస్తే చాలు, 'కా' 'కా' అని అరుస్తూ నెత్తిమీద తన్నేది! ఆరోజు నేను దొడ్లోకి వెళ్ళేటప్పటికి ఒక్క కాకికూడా చెట్టు మీదలేదు. గుడ్లు పిల్లలయ్యాయో లేదో చూడ్డానికి మంచి అవకాశం దొరికింది

నేను నెమ్మదిగా ముళ్లు గుచ్చుకోకుండా, చెట్టుఎక్కి గూడు సమీపించాను. ఎక్కడి నుంచి వచ్చాయో, ఎలా పసికట్టాయో తెలియదు - రెండు కాకులు అరుస్తూ వచ్చి నన్ను చుట్టేశాయి. నాకు వెఱ్ఱిభయం వేసింది ముళ్లు గుచ్చుకోకుండా చూచుకుంటూ, నెమ్మదిగా దిగి పోతున్నాను. ఇంతలో ఓకాకి నానెత్తిమీద ఫెడేల్‌మని తన్నింది. అసలే గజ, గజా, వణుకుతున్నానేమో - నా చెయ్యి కాస్తా పట్టుజారింది. గావు కేక పెట్టి కింద పడిపోయాను.

మాఅమ్మ ఒక్క పరుగుని ఇంట్లోంచి వచ్చింది. వళ్లు గీసుకు పోయి రక్తం చిమ్మింది, కాలు మునిగిపోయి శీలమండలో ఇరుకు పెట్టింది మాఅమ్మ ఎత్తుకుని ఇంట్లోకి తీసుకువచ్చింది. నాకాలు బాగా వాచిపోయింది. ఆటలు లేవు సరి గదా, ఒక్క అడుగేనా కదలడానికి కూడా వీలులేకుండా పోయింది. నా అవస్థ ఏం చెప్పను? మంచం దగ్గరే భోజనం.

రెండు రోజులకి నొప్పి కొంచెం తగ్గింది కానీ, నడవడానికి మాత్రం స్వాధీనం కాలేదు మంచం మీదేం తోస్తుంది? మాఅమ్మ మారవిణీని, నన్నూ ఆడుకుంటూ కూర్చోమని వైకుంఠపాళీ, గవ్వలూ పడేసింది. ఆఆట ఏం బాగుంటుందనీ, వెధవ పెద్దపాము నోట్లోపడడం, కోతి దగ్గరికి దిగి కూర్చోటం! రెండు మూడు మార్లాడేసరికి నాక సహ్యంవేసింది. మరిం కెలాగ కాల క్షేపం? బాగా ఆలోచించాను. మంచిఆట ఒకటి తోచింది.

"ఒసే చెల్లెమ్మా, ఈఆట బాగుండలేదు నువ్వు నేచెప్పిన ఆట ఆడతావా?"

"ఏమాట?"

"ఆడతానంటే చెప్తాను"

"ఓ తప్పకుండ ఆడతాను"

"ఇదిగో, జాగ్రత్తగా విను. నేనేమో, మరీ, శేషమ్మ బామ్మ గారినిట; నువ్వేమో, వాళ్లింటి కొచ్చిన చుట్టానివిట; ఏం?"

"ఓ! బలే, బలే, చాలా బాగుంటుందిరా: తప్పకుండా ఆడతాను. ఒరే, మరీ-నీకు గుండేదిరా?

"నా కానిమిషంలో నాజుట్టు చూస్తే ఒళ్లు మండుకొచ్చింది. ఐనా మా రవిణీని డబాయించేను. "వెధవ తెలివి? ముసుగేసుకున్నాక జుట్టెలా కనిపిస్తుందే?"

"ఐతే నేనే శేషమ్మ బామ్మ నవుతాను. నువ్వే చుట్టానివి"

నాకు మారవిణీ మీద చెడ్డ కోపం వచ్చేసింది. మరోప్పుడైతే వీపు మీదోటి అంటించేవాడినే. అప్పటి నాస్థితినిబట్టి మంచి మాట ఆడవలసి వచ్చింది.

"ఇదిగో, చూడు. చెల్లెమ్మా! మొదట నేనేమో బామ్మవేషం వేస్తాను. ఆతరవాత, కేశీమో, నువ్వేద్దువుగాని. ఏం? మరి నేను పెద్దాణ్ణి కదూ?"

మారవిణీ, ఏకళనుందో ఏమో, వప్పుకుంది. నాకు మానాన్న తెల్ల పంచ తెచ్చి యిచ్చింది. నేనాపంచ చక్కగా నెత్తిమీదికి ముసుగు వచ్చేటట్టు కట్టుకున్నాను. మారవిణీ, మానాన్న కండువా పమిటేసుకుని మొహాన్నింత కుంకం మెత్తుకుని తయారయింది.

"ఏం? ఇంక మొదలెడదామా?"

"ఊఁ"

అది చేతిసంచీ ఓటి పుచ్చుకుని వీధి గుమ్మం దగ్గిరనుంచి తిన్నగా నావద్దకు వచ్చింది నేను దాని మొహం చూస్తూనే దొడ్లోవున్న మాఅమ్మకి వినిపించకుండ మొదలెట్టాను ఏడుపు.

"ఓయి దేముడోయ్! ఓయి దేముడా! నాకెంత గతి తెచ్చిపెట్టావురా? దేముడోయ్ – దేముడా! ముక్కు చీదేశాను. మారవిణీ చేతి సంచి కిందపెట్టి, నాదగ్గిరకి వచ్చి కూర్చుని - "ఊరుకోండి వదినా! ఊరుకోండి. ఏం చేస్తాం?"

"ఈ అవస్థకూడా ఉండనుకో లేదో. అయ్యో దేముడా! .

"వదినా! విచారించి యేం లాభం? ఆయనకేం మహారాజు. వెళ్లిపోయారు."

నేను దుఃఖం పట్టలేనట్లు ముక్కు చీదేస్తూ అందరూ వింటారన్న

మాట మర్చిపోయి ఏడుపు శృతి పెంచేశాను.

"అందరి ఆయువు పోసుకు బతుకుతున్నానోయ్ దేవు—"

అంతే నా యేడుపు కట్టడి పోయింది. మాఅమ్మ దొడ్లోనుంచి పరిగెత్తుకు చక్కా వచ్చింది. మాఆట ఇంకా పూర్తిఅవనే లేదు. ఏడుపు స్వరంతో నేను చెప్పవలసిన మాటలు ఇంకా చెప్పనే లేరు!

అసలు సంగతేమిటంటే మా పక్కఇంట్లోనే మా పురోహితుడు గారున్నారు. ఆయన తండ్రి ముసలి వగ్గు. రెండేళ్లనుంచి పక్షవాతంతో మంచంమీదే వుండి ఓ నాడు టపా కట్టేశాడు. ఆయనభార్యకి, ఆయనకి పదేళ్లనుంచి మాటలులేక పోయినా, ఆవిడమాత్రం యథా విధిగా ఏడ్చేది. ఆవిడ అల్లా ఏడ్పు మొదలెట్టేసరికి, నేనిలా మాగోడ మీద యెక్కి కూర్చునే వాడిని. అక్కడ వాళ్లింట్లో ఏడుపు పూర్తయ్యాక కానీ గోడ దిగేవాడిని కాదు. గోడమీద నుంచి చూస్తే వాళ్లింట్లో అన్నీ కనిపిస్తాయి. నాకావిడ ఏడుపంతా వచ్చేసింది. ఎక్కడ చీదాలో, ఎక్కడ బెక్కాలో నాకు బాగా తెలుసు - కాని, ఏం లాభం! మధ్యలో మాఅమ్మ వచ్చేసింది. వచ్చేసి ఊరుకున్నదా?

"ఓరి వెధవల్లారా! ఏం చేటు కాలం వచ్చిందర్రా? - నిండింట్లో కూర్చుని" అని నన్నో రెండు, మారవిణి నోరెండు అంటించింది. నేను హడిలిపోతున్నాను ఈసంగతి మానాన్నకి తెలిస్తే ఏం చేసి పోతాడో అని!

కాని మానాన్న నన్నేమీ అనలేదు. ఆమర్నాడు నాజుట్టు తీయించేసి భద్రంగా తిరుపతి పంపించి, నన్నీ ఊరు, మాపిన్ని దగ్గిరకి, చదువుకు పంపించాడు. ఇదీ, నాసంగతి.

★

జంతుకోటిలో మానవలక్షణాలు

(32-వ పేజీ తరువాయి)

ఈమాదిరిగా ఫలాని రకం, ఫలానిరంగు బిళ్ల పడేస్తే ఫలాని ఫలానివి వస్తాయనే జ్ఞానం జంతువులకి అంత తేలికగా అలవడదేమో అనుకొంటాం. మన పిల్లవాడు, కానీ కోసం గోలచేసినప్పుడు, మన దగ్గిర చిల్లరలేక అణాయిస్తా మనుకోండి. కానీ కంటే అణాకే ఎక్కువ పిప్పరమెంట్లు వస్తాయని మనం ఎంత చెప్పినా, తానడిగిన కానీ కంటే యిది చిన్నదనే కారణంచేత వాడు, తనను మనమేదో మోసం చెయ్యబోతున్నా మను కొంటాడు కదా!

అట్లాంటిది యీ చింపాంజీలు యీ రకరకాల బిళ్లలకు విలువల్లో గల తేడాలు తెలుసుకో గలిగాయి ఆవిషయం ఎలా బుజువైందీ అంటే-ఒకరోజున ఒక చింపాంజీ తెల్ల టిక్కెట్లు సంపాదించుకోవటంలో ప్రపంచాన్ని మరచివున్న సమయంలో పెనగ్గా పోయి యీ డాక్టర్ జాన్‌గారు ఎలిక పిల్లను వదిలిపెట్టారు. సహజంగా చింపాంజీలకి ఎలుక లంటే మహా చెడ్డ భయం [అన్నీల మిన్నలు అయిన మానవాంగనల వలెనే!] ఆ చింపాంజీ కూడా ఆఎలకను చూసి మహా బెదిరి పోయి, బోనులో అన్ని మూలలకీ పోయి దాక్కొబోయింది. ఏమూల నక్కినా ఆఎలుక మీదిమీదికి వస్తూవుంటే, దానికి దిక్కు తోచ లేదు. క్షణం ఆలోచించి, పచ్చ టిక్కెట్టు పట్టుకొచ్చి ఆమిషన్‌లో పడేసింది.

లోగడ జరిగిన ఏర్పాటు ప్రకారం పచ్చటిక్కెట్టు మిషన్‌లో పడగానే యీడాక్టరుగారు చింపాంజీని తన మూపులమీదికి ఎక్కించుకు తిరగాలికదా! ఈయనకు తప్పలేదు. వొంగున్నాడు. చింపాంజీ ఒక్క వుదుటున పోయి ఆయన భుజాలమీద ఎక్కి కూర్చొని, తన సక్కడినుంచీ చప్పున బయటకు తీసుకొపొమ్మన్నట్లు ఆయనను పట్టుకు గుర్రాన్ని బాదినట్లు బాదటం మొదలు పెట్టింది.

ఇదంతా చదవటానికీ వినటానికి బాగానే వుంది కానీ, డబ్బును గూర్చిన మమకారం ఎప్పుడైతే ఆ జంతువులో ప్రవేశపెట్టామో, అప్పటినుంచీ అవి కూడా మనలాగే కాపీనాన్ని పెంచుకొని, ఒకదాన్ని ఒకటి మోసం చేసుకోవటం మొదలుపెట్టాయని తెలిసిన తరువాత మాత్రం కొద్దిగా బాధ కలుగుతోంది.

(ఇంకా వుంది)

★